

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# పొగ – నిప్పు

**ఆరోజు ఆదివారం.** పొద్దున తొమ్మిదిగంటలకు బంగార్రాజు ఇంట్లో సమావేశముందని వర్తమానమందటంతో ఆ సమయానికి అక్కడికి వెళ్లాను. బంగార్రాజుమేడ మావీధిలో బురుజువైపు వరసలో ఎనిమిదో ఇల్లు. నేవెళ్లేసరికే మావీధి సంక్షేమసంఘం పెద్దలు పదిమందిదాకా వచ్చి విశాలమైన డ్రాయింగ్ రూములో రోజ్ ఉడ్ సోఫాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వేడిగా ఇడ్లీలు, గారెల ఉపాహారం, కాఫీలయ్యాక సమావేశం మొదలైంది.

మా ఉపాధ్యక్షుడు ఆడిటరు నారాయణమూర్తి సమావేశం ప్రారంభించి అనర్గళంగా పావుగంటసేపు విషయం వివరించాడు.

'మనవీధిలో అందరూ ధర్మరక్షణ కంకణాబద్ధులు, పాపభీతి, దైవభక్తి గలవారు. సంప్రదాయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తారు. అసలు ఊళ్లోవాళ్లకే మనవీధి ఆదర్శం. మనవీధి సంక్షేమసంఘం ఇందుకు సంబంధించి అన్నిటాముందుంటుంది. సమస్యలను పరిష్కరించి సమాజాన్ని సజావుగా నడిపిస్తుంది. ఐతే ఇప్పుడు మనకే ఒక చిన్న సమస్య వచ్చింది'

'గుడిపక్కన రెండోయింట్లో ఉండిన, స్వర్గస్తుడైనపాత పూజారి చంద్రమౌళి ఎంతో నియమనిష్టలతో మార్కండేశ్వరాలయ పూజారిగా తన బాధ్యతలు నిర్వహించాడు. దురదృష్టవశాత్తూ ఆయుష్షుతీరి రెండేళ్లకిందట అనారోగ్యంతో మధ్యవయసులోనే అకాలమరణం పొందాడు. ఆసమయంలో వీధిలోని పెద్దలంతా ఆయనభార్య, ముగ్గురు పిల్లలున్న ఆ కుటుంబానికెంతో సహాయం చేసారు.  చంద్రమౌళి పోయాకకూడా మనం మన ఆదరణ కొనసాగించాము. వాళ్లకుటుంబమూ అలాగే పద్ధతిగానేవుండేది'

'అలాంటి సత్పురుషుడి పెద్దకూతురైన విమలను చిన్నప్పట్నుంచి మనం చూసాము. యెంతో నెమ్మదిగా, మాటవినపడకుండా, చక్కగా వొదిగి ఆడపిల్లలకు ఆదర్శంగా వుండేది. యెప్పుడూ ఆయిల్లూ, గుడితప్ప మరోలోకముండేది కాదు. ఏడాదికిందట విమల బియ్యే పూర్తిచేసి ఒక ప్రైవేటు కంపెనిలో ఉద్యోగంలోచేరిందని తెలిసి అందరం ఎంతో సంతోషించాము'

'ఐతే ఆమె ప్రవర్తన ఈమధ్యకాలంలో అంతగా బావుండడంలేదని ఫిర్యాదులొస్తున్నాయి. ఎంతో బాధ్యత్తో మనవీధి ఆడవాళ్లు తెచ్చిన పెళ్లిసంబంధాలన్నిటినీ విమల తిరగ్గొట్టింది. సిటిలోలాగ ఫ్యాషన్ గా తయారౌతోంది. తరచుగా ఆపిల్ల రాత్రిళ్లు ఆఫీసునుంచి ఆలస్యంగా ఇంటికి వస్తోంది. అదికూడా ఎవరో కారులో దింపుతున్నారు. వొక్కోసారి క్యాంపులనిచెప్పి రెండ్రోజులు ఇంటికే రావడం లేదు. కొత్తవాళ్లైన మగవాళ్లు ఆమెకోసం ఇంటికొస్తున్నారు. ఈ విషయాలన్నీ వీధిలో అందరూ గమనిస్తున్నవే. ఆఫీసులోనూ గుసగుసలుగా ఉందంట. అంతేకాదు, ఉద్యోగంలోచేరిన ఈ యేడాదిలోనే

ఆమె తమ అప్పులన్నీ తీర్చేయడం, ఫ్రిజ్, సోఫాసెట్టులాంటి ఖరీదైన వస్తువులు, మంచిబట్టలేకాక ఒక స్కూటర్ కూడా కొనడం మనవాళ్ల దృష్టిని తప్పించుకుపోలేదు.'

'ఇది ఎంతో సంప్రదాయ ప్రతిష్టగలిగిన వీధి. అంతా మర్యాదస్తులున్న వీధి. వయసులోవున్న, వయసుకొస్తున్న ఆడపిల్లలున్నారు. పోనీలే మనపిల్లేగదా నాల్రోజుల్లో తెలుసుకుంటుందని ఎదురుచూసాము. కొంతమంది మనవీధి ఆడవాళ్లు ఆ అమ్మాయికి మంచిచెప్పి చూసారు. కానీ ఆపిల్లలో మార్పులేదు. కాబట్టి ఒక పెద్దమనుషుల బృందం ఈపూట వాళ్లింటికి వెళ్లి తగినవిధంగా చెప్పి ఆపిల్లను దారిలో పెట్టాలి.'

ఇదీ నారాయణమూర్తి ఉపన్యాససారాంశం.

'విమలగురించిన సమస్య' అంటూ సమావేశం పెట్టి ఇలా మాట్లాడతారనుకోలేదు నేను. ఆకుటుంబానికేదైనా సహాయం చెయ్యడంకోసమేమో అనుకున్నా. విమల చిన్నప్పటినుంచి నాకు తెలుసు. మా ఆవిడ కామేశ్వరితో సన్నిహితంగా ఉండేది. హైస్కూలు రోజుల్నుంచి మాయింటికొచ్చి జెనరల్ పుస్తకాలు, మంచి సాహిత్యం పుస్తకాలు తీసుకెళ్లి చదివేది. తెలియనివన్నీ అడిగి తెలుసుకునేది. ఉద్యోగంవచ్చాక రావడం తగ్గిపోయింది. నిజమేదైనా ఆపిల్లమీద ఇలాంటి ఆరోపణలు రావడం నాకు కష్టంగావుంది.

నేనీ మీటింగుకొచ్చేముందు మా ఆవిడ కామేశ్వరి అసహనంగా కనపడింది.

"విమల వీళ్లుతెచ్చిన రెండోపెళ్లివాణ్ణి పెళ్లిచేసుకొని అట్లా దీనంగా పడివుండకుండా స్వశక్తితో వుద్యోగం తెచ్చుకుని స్వతంత్రంగా బతుకుతున్నందుకు యేడుపుతో ఆపిల్లమీద యివాళ పంచాయతి పెట్టినట్టున్నారు. నువ్వు వాళ్లమాటలకు లొంగిపోయి తలూపకు" అని కామేశ్వరి పొద్దున నాకు ఆవేశంగా వార్నింగిచ్చింది.

ఉద్వేగంతో సలహాలనివ్వడం ఆడవాళ్లకు సులభం కావచ్చు, కానీ వీధిలోని పెద్దమనుషుల మాటను వ్యతిరేకించడం మగవాళ్లకు అంత సులభంకాదని కామేశ్వరికి తెలియదు.

సమావేశంలో సుమారు గంటసేపు తర్జన భర్జనలు, వాదోపవాదాలు అయ్యాయి. నిజాలు తెలుసుకోకుండా వొక ఆడపిల్లమీదున్న అభాండాలను నిర్ధారించడం సబబుకాదని నేనూ, చలపతి చెప్పాము. రెండోరౌండు కాఫీల తర్వాత మితవాదులు ఓడిపోయి అతివాదులు గెల్చారు. 'వెంటనే ఓ నలుగురు వాళ్లింటికివెళ్లి గట్టిగా మాట్లాడి, 'ప్రవర్తన మార్చుకుంటానని' ఆపిల్లచేతే అనిపించి, దార్లో పెట్టా'లని ఒక నిర్ణయం తీసుకోబడింది. తాము ఆ నిర్ణయాన్ని బలపరుస్తున్నామని ఐతే ఈ విషయంలో తాము ఇంతకంటే ముందుకు వెళ్లలేమని మునిరెడ్డి, బసవలింగం, బంగార్రాజు, స్వామినాయుడు చెప్పారు.

'యితరుల దైనందిన జీవితాలకు, మన మూలధర్మాలకు భంగం కలిగించని వ్యక్తిస్వేచ్చను వైదికశాస్త్రాలు అంగీకరిస్తాయని' కాశీనాథ్ చెప్పాడుగాని ఎప్పటిలాగే అతని మాటలనెవరూ ఖాతరు చెయ్యలేదు.

ఆమీదట ఐదుగురితో ఒక బృందాన్ని ఎంపిక చేసారు. ఆ బృందానికి నారాయణమూర్తే నాయకుడు. మాసంఘ ఏకైక స్త్రీ సభ్యురాలు సుగుణమ్మ, సోమయాజులు, రంగశాయి, చలపతి ఇతరసభ్యులు. చలపతి అయిష్టంగానే ఒప్పుకున్నాడు. నావరకూ రాదనుకుని స్థిమితంగా కూర్చున్న నన్నూ ఆ బృందంలో అదనపు సభ్యుడిగా చేసారు. సాధారణంగా ఇలాంటివిషయాల్లో తలదూర్చని నేను చాలా ఇబ్బందిలో పడ్డాను.

అందులోనూ విమల నిస్పృహతో ఉద్యోగాలవేటలో ఉన్నప్పుడు నేనామెకు పుస్తకాలు కొనిచ్చి, ఫీజులుకట్టి, ధైర్యంచెప్పి నాకు తోచిన సహాయం చేసాను. అదితెలిసే నాకు దండనగా నన్నీ బృందంలో వేసారని నాకు అర్థమైంది.

“ఎవరి మంచితనం మీదైతే మనకు బాగా నమ్మకముంటుందో వాళ్లగురించిన చెడేమైనా తెలుస్తుందని అనుమానమొస్తే మనం సందిగ్ధంలో పడతాం. నిజం తెలుసుకోవడానికంటే దాన్ని దాటవేయడానికే ప్రయత్నిస్తాం, కానీ అది తప్పు, నిజమెలాంటిదైనా తెలుసుకోవడానికి వెనకాడకూడదు” అంటుంది కామేశ్వరి. కానీ నాకు ఇలాంటివిషయాల్లో కామేశ్వరికున్నంత నిబ్బరం లేదు. ఒక ఆడపిల్ల స్వాతంత్ర్యాన్ని ప్రశ్నించడానికి, అందులోనూ ఇలాంటి విషయం ప్రస్తావించడానికి  ఆ బృందంతో విమలవాళ్లింటికి వెళ్లడం నాకిష్టం లేదు. ఐతే, సంఘనిర్ణయాన్ని వ్యతిరేకించాలంటే భయం కాబట్టి వాళ్లతో బయలుదేరక తప్పలేదు.

మేం విమలవాళ్లింటికి వెళ్లేసరికి పదకొండయ్యింది. మావీధి సందడిగాలేకపోయినా ఇంతమంది సంఘసభ్యులం ఒకేసారి కలసివెళ్లడం వీధిలో తిరుగుతున్నవాళ్లకి వింతగా కనపడింది. ఒకయింటిముందు ‘వార్తల వనజమ్మ’ ఎవర్తోనో మాట్లాడుతూ ఒకకన్ను మావైపేసింది. ఒకట్రెండు ఇళ్లలో తలుపుచాటుగా మమ్మల్ని చూస్తున్నారు. నాకు ఇబ్బందిగా అనిపించింది. చెట్లనీడలతో, వీధిచివర నదిపైన్నుంచి వస్తున్న గాలితో చల్లగావుంది.

విమలయిల్లు రెండొందలగజాల స్థలంలో చిన్న పెంకుటిల్లు. ఇంటిముందు దేవగన్నేరు, పారిజాతం చెట్లు. మట్టిగోడపైన బండలు పరిచిన ప్రహరీగోడ చాలాచోట్ల బీటలువారింది. పాత చెక్కగేటు తెరుచుకుని లోపలికెళ్లాం.

ముందుగా పూల సువాసనలు మమ్మల్ని ఆహ్వానించాయి. ముందుభాగంలో చక్కగా పెంచుతున్న మల్లె, జాజి, చేమంతి, బంతి, కనకాంబరం, లిల్లీ, నందివర్దనం, మందార, గన్నేరులాంటి పూలచెట్లున్నాయి. చంద్రమౌళి బతికున్నప్పుడు గుడిలోనివాటికి అదనంగా ఇంటిపూలన్నీ గుళ్లో వాడేవాడు. విమల తల్లి లలితమ్మ చక్కటి పూలదండల్ని తయారుచేసేది. వాళ్లపరిస్థితి బాగలేనప్పుడుకూడా ఇంటిపూలను గుడికే ఇచ్చేవాళ్లు. ఇప్పటికీ ఇస్తున్నారు.

తలుపు తీసేవుంది. వరండాలో కొత్త లేడీస్ స్కూటర్ పెట్టివుంది.

తలుపుదగ్గర ఆగి పిలిచాం. లలితమ్మ లోపల్నుంచి వచ్చి చూసి చీరకొంగు భుజంచుట్టూ కప్పుకుని గాబరాగా "రండి, రండి" అని లోపలికి ఆహ్వానించింది. ఇదివరకు బక్కచిక్కి ఉండేది. ఇప్పుడు కాస్త పరవాలేదన్నట్టుగ ఉంది.

వరండాదాటి హాల్లోకి వెళ్లాం. హాలు ముందుభాగంలో కొత్త సోఫాసెట్టుంది. పాతటేబుల్ మీద టీవి, ఒక చెక్క ర్యాక్ లో పుస్తకాలున్నాయి. కిటికీలకు కొత్తతెరలు, మూలల్లో మట్టికుండీల్లో పూలు ఉన్నాయి. హాలు రెండోభాగంలో నేలమీదకూర్చుని పుస్తకాలు ముందేసుకుని చిన్నకూతురు చదువుకుంటోంది. ఆమె కొడుకు చిన్నవాడి అలికిడి లేదు, ఆడుకోవడానికి వెళ్లినట్టున్నాడు.

"కూర్చోండి బాబూ" అని లలితమ్మ మాకు సోఫాచూపించి గోడకానించివున్న మడతకుర్చీలను సోఫాపక్కన వేయమని చిన్నకూతురికి పురమాయించింది. అందరం కూర్చున్నాము.

నారాయణమూర్తి ఆమె క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నాడు. సోమయాజులు విమల ఉద్యోగంగురించి, రంగశాయి పిల్లల చదువువిషయం ప్రస్తావించారు. చివరగా సుగుణమ్మ తాము విమలతో మాట్లాడ్డానికి వచ్చామని ఆమెవుంటే పిలవమని చెప్పింది.

ఆమె భయంగా తలవూపి లోపలికెళ్లింది.

కాస్సేపట్లో విమల వచ్చి అందరికీ నమస్కారం చేసి గోడకానుకుని నిల్చుని మమ్మల్ని విడివిడిగా కుశలప్రశ్నలడిగింది. తలస్నానం చేసి వదులుగా జడవేసుకుంది. ఎర్రంచు తెల్లటి కాటన్ చీరలో సన్నగా కనిపించినా హుందాగా ఉంది.

విషయమెలా మొదలుపెట్టాలో తెలియక ఓ పావుగంటసేపు పిచ్చాపాటి మాట్లాడాం. చివర్లో ఆమె ఉద్యోగం ప్రసక్తి తెచ్చాడు రంగశాయి. కాసేపయ్యాక నారాయణమూర్తి అందుకుని ఆమె రాత్రిళ్లు ఆలస్యంగా ఇంటికిరావడం, కార్లో దింపడంలాంటివి ప్రస్తావించి ఆమె అలాంటి ఉద్యోగం చెయ్యడంపట్ల ఆమెకు సానుభూతి చూపిస్తూనే మావీధి పెద్దల విముఖతను పరోక్షంగా, మెత్తగా వ్యక్తం చేసాడు.

విమల ఆయన మాటలకు చిన్నగా నవ్వింది. అంతకు ముందే మావీధిలోని కొందరు ఆడవాళ్లు ఈ విషయంలో ఆమెను హెచ్చరించడంలాంటివి జరిగాయి కాబట్టి మా రాకలోని అంతరార్థం పసిగట్టి ఆమె తయారుగానే ఉన్నట్టు నాకనిపించింది.

"నాకూ యిబ్బందిగానే వుంది. యేంచెయ్యను, ఆ వుద్యోగం అలాంటిది" అంది విమల

"వేరే మంచివుద్యోగం వచ్చేదాకా ఆగాల్సింది. డబ్బవసరమని యెలాంటి వుద్యోగమైనా చేస్తామా" అన్నాడు సోమయాజులు.

విమల మళ్లీ నవ్వి "యింట్లో నలుగురు బతకాలగదా అంకుల్. మీఅందరికీ తెలుసు, మానాన్న హైస్కూలు ఫష్టొచ్చాడు. పై చదువులకు స్కాలర్ షిప్ కూడా వచ్చిందంట. మంచివాడని యీ వీధిలోని అప్పటి పెద్దలంతా మా తాతమీద వొత్తిడి తెచ్చి మానాన్నని వంశపారంపర్య పూజారిని చేసారు. ఆ తరువాత పక్కవీధుల్లో కొత్తదేవాలయాలు

వెలిసి మన గుడి ఆదాయంతగ్గి మానాన్నకు సగం జీతంకూడా వచ్చేది కాదు. ఐనా ఆయన నిష్టగా పూజలు చేసేవాడు, పళ్లెంలో ఆయనకిచ్చిన కానుకలనుకూడా హుండిలో వేసేవాడు. వారంలో మూడురోజులు పస్తులుండి ఆయన ఆరోగ్యంపాడై మధ్యవయసులోనే చనిపోయాడు. నేనాడమనిషిని కాబట్టి మీరు వేరేపూజారిని పెట్టుకున్నారు. అదే మానాన్న యేవుద్యోగమో చేసివుంటే మాకీ బాధలుండేవికాదు అనిపిస్తుంది" అని కళ్లు మూసుకుని తల వొంచుకుంది.

"మీ నాయన పోయినప్పుడు మేమంతా చందాలువేసుకోని మీకు డబ్బిచ్చినాము, నువ్వు మాకూతుర్లాంటిదానివేగదా అమ్మా" అంది సుగుణమ్మ.

"మీ సహాయానికి మేమెప్పటికీ కృతజ్ఞులమే. కానీ మాది నలుగురున్న కుటుంబం. వొక్కపూటే భోజనం చెయ్యడంవల్ల మీరిచ్చిందాంతో ఆర్నెల్లు గడిచాయి. యిలాంటిది జరిగినప్పుడు ఆ కుటుంబంలో మరోమనిషి నిలదొక్కుకునేవరకూ బాధ్యత తీసుకునే పద్దతి లేకపోవడంతో ఆర్నెల్ల తరువాత మేము యాచిస్తూ అవమానాల్తోనే గడపాల్సొచ్చింది. వూళ్లో అందరూ మంచివాళ్లే వుండరుగదా! సంఘం విధించిన నియమాలను పాటిస్తూ మీరు చెప్పిన పద్ధతిలోనే మేము పెరిగాము. గుడిపనులుతప్ప వేరే విద్యలు, పనులు నేర్చుకోలేదు. ఐతే మానాన్న పోయాక, మీసంప్రదాయం ప్రకారం గుడివుద్యోగం మాకుటుంబానికి రాకపోయేసరికి మేము యెవరికీకాకుండా ఐపోయామని తెలిసింది. నైపుణ్యమున్న పనులేవీరాక, డబ్బూలేక మమ్మల్ని పెంచిన సమాజానికే వొక్కసారిగా పరాయివాళ్లమైపోయాం. అష్టకష్టాలుపడి నా బియ్యేచదువు పూర్తిచేసుకొని యేదోవొక వుద్యోగం వెతుక్కోవాల్సివచ్చింది" అంది తలొంచుకునే.

"వీధిలో మేమూ యెవరికి వాళ్లమే, యీవీధి వొక గవర్నమెంటో, కంపెనీయో కాదుగదా తల్లీ" అన్నాడు నారాయణమూర్తి.

'అలాంటప్పుడు మీకు ప్రత్యేకం ఒక గుడి ఎందుకు? అసలు మరి మీరంతా కట్టగట్టుకుని ఇప్పుడెందుకొొచ్చారు?' అని అడుగుతుందనుకున్నాను. కాని ఆమె తన ధోరణిలో చెప్పుకుపోయింది.

"మనవీధి 'పరోపకారి పాండురంగ బాబాయ్', సుశీలపిన్ని మా క్షేమం కనుక్కుంటూనే వున్నారు. యెక్కువమంది పట్టించుకోకపోయినా కొందరు మొన్నటిదాకా దయతో సహాయం చేసారు. వాళ్లని మేమెప్పటికీ మర్చిపోలేము" అని నావైపు చూపిస్తూ "సూర్యం ఆంకుల్ పెద్దగా గుడికెప్పుడూ రాకపోయినా మాకు అండగా వున్నారు" అంది.

"నే రాకపోతేనేం, గుడికి మా ఆవిడ వచ్చేదిగా" నేనామెకు అదనంగా సహాయం చెయ్యడాన్ని సమర్ధించుకుంటూ అన్నాను. కామేశ్వరి స్నేహితురాళ్లతో కలసి ఎక్కువగా గుడిలోనే సాంస్కృతిక, సాంఘికసేవా కార్యక్రమాలు చేస్తూంటూంది. అసలు దేవాలయాలు కట్టిన ఉద్దేశ్యమే వేరంటుంది.

ఆమె మావీధి పెద్దలను పొగుడుతూనే, ఎవర్నీ తప్పుపట్టకుండానే తాముపడిన కష్టాలని, అవమానాల్ని చెప్పుకుపోతోంది. ఆమె మా సానుభూతి ఆశించినట్టుగా కాకుండా వాటిని ఖచ్చితమైన సమాచారం అందించినట్టుగా లాజికల్ గా, వినయంగా చెప్పడం నాకాశ్చర్యమైంది.

"యీమె చెప్పేది నిజమే. వాళ్లనాన్నది మనవాళ్ల విశ్వాసంమీద ఆధారపడిన వుద్యోగం, పునాదిలేని మేడలాంటిది. ఆమెకో మంచివుపాది దొరికేదాకా ఆమెబాధ్యత మనదేగదా" అన్నాడు మాయెదురింటి చలపతి నా చెవిలో చిన్నగా. నేనేం మాట్లాడలేదు.

"మా నాన్నపోయాక నాకా వుద్యోగం రావడమే గొప్ప. అదైనా యింగ్లీషు నేర్చుకోవడంతో వచ్చింది. యిక అందులో లోపాల్ని వెతికి వదిలేస్తే మేం బతకడమెలా మీరే చెప్పండి, మళ్లీ మీకు భారం కాలేముగదా" అని మెలికవేసింది విమల.

కొంచెంసేపు ఎవరూ మాట్లాడలేదు. పరిస్థితి తమ చెయ్యి దాటిపోతోందని గ్రహించినట్టున్నారు మా బృందసభ్యులు.

"మా స్వంత పిల్లలాంటిదానివి. చెడ్డపేరు మూటగట్టుకుంటున్నావేమో, నీకునువ్వే సరిచూసుకుంటావని చెప్పడానికే వచ్చాం. మనమంతా పరువు ప్రతిష్టలుగల వాళ్లుండే వీధిలోవున్నాం" అన్నాడు రంగశాయి.

నాకే భయమేసిందిగాని ఇంతమాట విన్నాకకూడా ఆమె తొణకలేదు.

"నా దురదృష్టంకొద్దీ నేను తప్పు చేస్తున్నట్టుగా మా ఆఫీసులోకూడా కొందరు అనుకుంటూంటే ఆధారాలు చూపమని అడిగాను. చూపలేకపోయారు" అందామె తాపీగా.

"యిలాంటివాటికి ప్రత్యక్షఆధారాలెవరు చూపించగలరు? వుద్యోగంలోచేరిన ఆరునెల్లలోనే సోఫాలు, స్కూటర్ లాంటి ఖరీదైన వస్తువులు కొనుక్కున్నావంటున్నారు" అన్నాడు మూర్తి.

"అంకుల్ మీరు జిల్లాలోనే పెద్ద ఆడిటరు, మీకు తెలియందేముంది? మా ఆఫీసుకెవర్నైనా పంపించి చూడమనండి. నేను తీసుకున్న లోనుకి జీతంలో కంతులు మినహాయిస్తున్నారో లేదో. సోఫాల్లేకపోతే మీలాంటి పెద్దమనుషులొచ్చినప్పుడు యెక్కడ కూర్చోబెడతాం" అంది నవ్వుతూ వాళ్లుకూర్చున్న సోఫావైపు చూసి. ఆమెకు కోపంగాని, దుఖంగాని రాకపోవడంతో మావాళ్లకు అసహనం పెరుగుతోంది.

“మరి రాత్రిళ్లు లేటుగా మీ బాసు కార్లో రావడం దేనికి? మిగతావాళ్లు అలా లేరే అన్న ప్రశ్నవస్తుందిగదా?" అడిగాడు సోమయాజులు.

"మా యెండిగారిగురించి వాకబుకూడా చేసివుంటే మీరిలా మట్లాడేవారు కాదు. ఆయనకు డెబ్బైయేళ్లు. అది పక్కనపెడితే మాది ఆయుర్వేదమందులు తయారుచేసే కంపెని అని మీకు తెలుసు. పదిమైళ్లదూరంలోవున్న ఫార్మ

ఆవరణలో మా యెండీగారికి క్యాంపు ఆఫీసువుంది. వారంలో రెండుమూడు రోజులు మధ్యాహ్నాలు అక్కడే పనివుంటుంది. బాగా ఆలస్యమైనప్పుడే నేను స్కూటర్లోరావడం క్షేమంకాదని నన్ను కార్లో దింపుతారు. నెలకోసారి మా డీలర్లతో మీటింగులు దూరంగా సిటీల్లో ఉంటాయి. నేను ఆయన సెక్రటరీని కాబట్టి వెళ్ళక తప్పదు. నేనేకాదు, యింకా వొకరిద్దరు ఆడవాళ్లుకూడా వస్తారు"

"పోనీ డెస్కుదగ్గర కూర్చొని చేసుకునే పని లేదామ్మా?" అంది సుగుణమ్మ సానుభూతిగా

"వయసులోవుండి, ప్రొఫెషనల్ డిగ్రీలు లేకుండా, కొంచెం బాగా మాట్లాడగలిగిన ఆడపిల్లలకు యిలాంటివుద్యోగాలే వస్తున్నాయి. మాకిష్టమున్నా లేకున్నా తప్పడంలేదు. కుటుంబాలను పోషించే ఆడపిల్లలెందరో యెన్నో నిందలు, యిబ్బందులు తట్టుకుంటూ యీ వుద్యోగాలు చేస్తున్నారు. అలాంటివాళ్లని చులకనగా చూడ్డం యింకా అన్యాయంకాదా? ఆ వుద్యోగాలుకూడా మా వయసు పెరిగితే పోతాయి. అందుకే ముందుజాగ్రత్తగా మూలికలపెంపకం, మందులతయారీలో శిక్షణకూడా తీసుకుంటున్నాను" అంది పాఠం చెపుతూన్న టీచరులాగ.

లలితమ్మ చిన్నకూతురిచేత కొత్త గాజుగ్లాసుల్లో అందరికీ మజ్జిగ పంపింది. గుళ్లో నైవేద్యం గంట గణగణమోగింది. గుడివెనకున్న చెట్లమీది పక్షులు కలకలమని అరిచాయి. వీధిలో ట్రాక్టర్ వెళ్లిన చప్పుడు పళ్లమ్మే ఆడమనిషి కేకలో కల్సిపోయింది.

"మాకూ ఆడపిల్లలున్నారుగదా?" అని సెంటిమెంటులోకి దిగాడు రంగశాయి ఖాళీగ్లాసు కిందపెట్టి.

ఆమె చిన్నగా నవ్వి "యిరవైనాలుగ్గంటలూ మీతోవుండి, మీ సత్ప్రవర్తన చూస్తూ, మీ మాటలువింటూ పెరుగుతూన్న మీపిల్లలు కేవలం నాగురించిన నాలుగు గాలివార్తలు విని చెడిపోతారని యెందుకనుకుంటున్నారు? మాలాకాకుండా వాళ్లంతా చక్కగా ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్నారు. రేప్పొద్దున వాళ్లు సిటీల్లో మంచి వుద్యోగాలు చేసినప్పుడు నాలాంటి పరిస్థితే యెదుర్కోవాల్సి రావచ్చు. అందుకే మారుతున్నకాలంలో మనసంప్రదాయాలు కొత్తమార్పులను తీసుకోకతప్పదు" అంది.

"అయితే అవన్నీ గాలివార్తలే అంటావ్" అన్నాడు నారాయణమూర్తి.

"కాదని మీరు నిశ్చితంగా కనుక్కుని చెప్పండి, నేను ఆరోజే యీవుద్యోగం మానేసి మీరడిగినట్టే యింట్లో కూర్చుంటాను" అందామె స్థిరంగా.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. తిరిగి ఆమే అంది.

"యిందాక చెప్పినట్టు మా ఆఫీసులోకూడా కొంతమంది వాళ్లే పొగ సృష్టించుకుని నిప్పుందేమోనని చూడ్డానికి నాదగ్గరికొచ్చారు" అంది చిన్నగా నవ్వి.

ఇక మాట్లాడేదేమీలేదని మా పెద్దలకు అర్ధమైంది. విధేయత చూపిస్తూనే యెక్కడా సందివ్వకుండా గట్టిగా నిలబడిందన్న సంగతి తెలుస్తూంది. చేసేదేమీ లేక మళ్లీ కొన్ని జాగ్రత్తలుచెప్పి మేమంతాలేచి బయటికి నడిచాము.

“వినయంగా మాట్లాడినా, అంత చిన్నమ్మాయి అంత పెద్దవిషయాలు అలా నిక్కచ్చిగా చెప్పి, అసలు మొదట మనదే ‘బాధ్యతారాహిత్యం, చాందసం’ అంటూంటే మనపెద్దలేమీ మాట్లాడలేకపోయారు" వీధిలోకొచ్చాక చలపతితో అన్నా ను.

"దీన్నే సైకాలజిలో 'అడల్ట్ టు అడల్ట్' అంటారని విన్నాను. జీవితంలో రోజూ డక్కామొక్కీలు తినేవాళ్లకు అలాంటివి అవే తెలుస్తాయనుకుంటా. లేకపోతే యీకాలపు ఆడపిల్లలు యెలా నెట్టుకొస్తారు? చిన్నపిల్లైనా మన పెద్దలకు పెద్దపాఠమే నేర్పింది. మనం ‘చూసింది‘ పరోక్ష ఆధారంగా యమధర్మరాజులా వెళ్లాం. ఆమె మార్కండేయుడిలా ‘నిజాన్ని’ అంటిపెట్టుకునివుంది” అన్నాడు చలపతి వెనక్కితిరిగి మా మార్కండేశ్వర గుడివైపు చూస్తూ.

"అంటే విమల యీవిషయంలో తను ‘నిప్పు’ అని మనకు తెగేసి చెప్పిందంటావా?" అని అడిగాడు మావెనక నడుస్తూ వచ్చిన రంగశాయి.

"అంతేకాదు మనం ‘పొగ’ అనికూడా తేల్చిందనుకుంటా" అన్నాడు మా యెదురింటి చలపతి వాళ్లింటివైపు వెళ్తూ.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments